APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 174 | పేజీలు : 04 వెల రూ. 2/- | సోమవారం 17-08-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 174 | PAGES : 04 PRICE : 2 | MONDAY 17 AUGUST 2026

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- కేంద్రం పరిశీలనలో రెండో విడత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులు
- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను - మిగతా 2 లో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'




- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన



## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

- రంగంలోకి దిగిన పవన్ కళ్యాణ్
- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

**అమరావతి :** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానిక ంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం - మిగతా 2 లో

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ



- సేవలను గుర్తు చేసుకున్న నేతలు
- అటల్ బిహారీ వాజ్‌పేయూ నివాళులు అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని
- వాజ్‌పేయి తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేశారన్న మోదీ
- కార్గిల్ యుద్ధంతో దేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారన్న అమిత్ షా

**ఢిల్లీ :** భారత మాజీ ప్రధానమంత్రి దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయూ వర్ధంతి సందర్భంగా దిల్లీలోని 'సదైవ్ అటల్' (వాజ్‌పేయూ స్మారక చిహ్నం) వద్ద ఆదివారం ఉదయం పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో సహా పలువురు ప్రముఖులు పాల్గొని మాజీ ప్రధానికి అంజలి ఘటించారు. 2018లో ఇదే రోజున తుదిశ్వాస విడిచిన వాజ్‌పేయూని ఈ సందర్భంగా మోదీ స్మరించుకున్నారు. వాజ్‌పేయూ ఒక అసాధారణ రాజనీతిజ్ఞుడు అని అభివర్ణించారు. ఆయన - మిగతా 2 లో

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

- కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!
- కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా



**ఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా - మిగతా 2 లో

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

- పార్కు, యూనివర్సిటీలో కాల్పులు
- అమెరికాలో మళ్లీ పెరిగిన కాల్పుల ఘటనలు
- కెంటకీలోని ఓ పార్కులో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి
- నాలుగేళ్ల చిన్నారితో సహా నలుగురికి గాయాలు
- వర్జీనియా యూనివర్సిటీలో మరో ఘటన, ఐదుగురికి గాయాలు
- కొద్దిరోజుల క్రితం జార్జియా స్కూల్‌లోనూ కాల్పుల ఘటన



**ఢిల్లీ :** అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ - మిగతా 2 లో

## రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క




- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం
- మేడారం వనదేవతల సమక్షంలలో చేయూత పింఛన్లకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- పలువురు మహిళలకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం
- హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన రేవంత్




## టీజీపీఎస్సీ కీలక ప్రకటన

- వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!
- వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ
- ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్

**హైదరాబాద్ :** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు - మిగతా 2 లో

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



**హైదరాబాద్ :** స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రకృతి చేస్తున్న హెచ్చరిక



వర్తమానంలో లాభార్జన కోసం భవిష్యత్తును బలిపెట్టే నయా ఉదారవాద విధానాలు ప్రపంచాన్ని ప్రమాదపుటంచులకు తీసుకెళ్తున్నాయి. దశాబ్దాలుగా యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా, ఆస్ట్రేలియాల్లో చోటుచేసుకుంటున్న కార్చిచ్చుల్ని పట్టించుకుని పర్యావరణ అనుకూల విధానాలు పాటించని ఫలితంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 37 కోట్ల ఎకరాల్లోని అడవులు, పొదలు తగలబడ్డాయని ఒక అంచనా. ఇలా కార్చిచ్చులో చిక్కుకున్న ప్రాంతం మంగోలియా దేశ విస్తీర్ణానికి సమానమని చెబుతున్నారు. స్పెయిన్, ఫ్రాన్స్ అటవీప్రాంతాల్లో, కెనడా, రష్యాల్లో గత వారం రోజు లుగా వ్యాపిస్తున్న మంటల వల్ల ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఫ్రాన్స్, స్పెయిన్ కార్చిచ్చులైతే ఊహించశక్యం కానంత స్థాయిలో ఉన్నాయి. వాటిని అదుపు చేయగలిగా మని ఆ రెండు దేశాలూ చెబుతున్నా జనంలో భయాందోళనలు ఉపశమించలేదు. నైరుతి ఫ్రాన్స్‌లో పారిస్‌కు నాలుగు రెట్లు పెద్దదైన విస్తీర్ణంలోని అడవి తగలబడటంవల్లగిరోండ్ ప్రాంతంలోని జనావాసాలనుంచి రెండున్నర లక్షలమంది పౌరుల్ని ఆదరా బాదరాగా తరలించాల్సివచ్చింది. ముఖ్యంగా బోర్డావ్ నగరంవైపు ఆ మంటలు వ్యాపిస్తున్న తీరు జనాన్ని హడలెత్తించింది. అటు స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ లక్షమందిని తరలించారు. దాని శివారు ప్రాంతాల్లో పలు జనావాసాలు తగలబడిపోయాయి. ఆ రెండూ యుద్ధ రంగాన్ని తలపింపజేస్తున్నాయని మీడియా కథనం. జరగాల్సిన నష్టం జరిగాక మంటల్ని ఏదోమేరకు అదుపు చేయటం సాధ్యమే. కానీ వాటివల్ల వ్యాపించే పొగవల్ల గాలి నాణ్యత దెబ్బతింటుంది. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సూక్ష్మ ధూళి కణాలు పీల్చేగాలిలో వ్యాపించి ఊపిరి తిత్తులు, గుండెసంబంధ వ్యాధులతో ప్రజారోగ్యం క్షీణిస్తుంది. అరుదైన వృక్షసంపద, జీవవైవిధ్యం బుగ్గిపాలవుతుంది. దాని కారణంగా వడగాడ్పులు చెలరేగి జనంఅల్లాడిపోతారు. ఈ ఖండాల్లో ఏటా కార్చిచ్చులవల్ల 3,40,000 అకాల మరణాలుసంభ విస్తున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి. 2023లో ప్రపంచ కర్బన ఉద్గారాల్లో కెనడా కార్చిచ్చుల వాటా 23 శాతమని అంచనా వేశారు. యూరప్ ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతున్నదని యూరోపియన్ యూనియన్(ఈయూ) పర్యవేక్షణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఫ్రాన్స్ కార్చిచ్చువల్ల ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాల్లోని పలు ప్రాంతాల్లో పొగ, ధూళితో కూడిన నీటియావిరి వ్యాపించి, అది మేఘాలుగా మారి, ప్రమాదకరమైన పెనుగాలులు, పిడుగుపాట్లు సంభవించాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా ఇలాంటి కార్చిచ్చులు మానవతప్పిదాలతోనే మొదలవుతాయి. కానీ వాతావరణ మార్పుల పర్యవసానంగా అవి వేగంగా విస్తరిస్తాయి. ఈ విషయంలో శాస్త్రవేత్తలు స్థూలంగా అంగీకారానికొచ్చినా, తమ నమూనాలు అందుకోలేనంత స్థాయిలో ఇవి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఈ తీవ్రతను పసిగట్టడానికి కొత్త ఉపకరణాలు అవసరం కావొచ్చున్నది వారి అభిప్రాయం. ఇప్పుడు స్పెయిన్, ఫ్రాన్సుల్లో మంటలు వ్యాపించిన అడవుల్లో పిక్నిక్‌లు, క్యాంప్ ఫైర్లు ఎక్కువ. అజాగ్రత్తగా ఉండే మనుషులవల్ల నిప్పు రాజుకోవటం, గాలిలో తేమ శాతం తక్కువుండే రాత్రివేళ మోడువారిన చెట్లు, ఎండుటాకులు అంటుకుని మంటలు వేగంగా వ్యాపించడం రివాజు. గత కొన్నేళ్లుగా ఈ కార్చిచ్చులవల్ల ఉత్పత్తయ్యే వేడి, పొగ ఆధారంగా పైరోక్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షరహిత పెనుగాలులతో కూడిన తుపానులు ఏర్పడుతున్నాయి. తీవ్రమైన ఆ వేడిగాలుల కారణంగా ఎక్కడెక్కడో పడే పిడుగులు మరిన్ని అగ్నిప్రమాదాలకూ, కార్చిచ్చులకూ దారితీస్తున్నాయి. విషపూరిత పొగ, బొగ్గు రేణువులతో ఉండే ఈ మేఘాలు అణు విస్ఫోటంలో వచ్చే పొగ మాదిరే దీర్ఘకాలం వాతావరణంలో అలుముకుని సూర్యరశ్మిని అడ్డుకుంటాయి. 2019--20లో ఆస్ట్రేలియా ఇలాంటి వాతావరణాన్ని చవిచూసింది. దానికి 'బ్లాక్ సమ్మర్' అని పేరుపెట్టారు. ఇకనైనా వాతావరణంతో ఆటలాడటం ప్రమాదకరమని ప్రభుత్వాలు గుర్తించాలి. గుప్పెడు కార్పొరేట్ సంస్థల లాభార్జన కోసం వాతావరణాన్ని బలిపెడితే ఊహకందని ఉత్పాతాలు కాటేస్తాయి. పర్యావరణం ధ్వంసమై మానవాళి మనుగడే పెను ప్రమాదంలో పడుతుంది. తాజా పరిణామాలు చేస్తున్న హెచ్చరిక ఇదే.

# పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు



**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది. ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.600 కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'



**మొదటిపేజీ తరువాయి -** తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్'బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# మాజీ ప్రధాని వాజ్‌పేయీకి నివాళులు అర్పించిన ముర్ము, మోదీ

**మొదటిపేజీ తరువాయి -** దార్శనికత, నాయకత్వం, సుపరిపాలన, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. "అటల్ బిహారీ తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. ఆయన నాయకత్వం మన దేశాన్ని బలోపేతం చేసింది. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై ఆయనకున్న శ్రద్ధ మనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుంది" అని మోదీ ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా వాజ్‌పేయికి ఘన నివాళులర్పించారు. దేశ సేవకోసం తన జీవితాన్ని అంకితం చేసిన దేశభక్తుడిగా, రాజకీయవేత్తగా వాజ్‌పేయిని గుర్తుచేసుకున్నారు. "మాజీ ప్రధానమంత్రి, బీజేపీ వ్యవస్థాపకుడు, భారతరత్న, పూజ్య అటల్ బిహారీ వాజ్‌పేయి గారి వర్ధంతి సందర్భంగా, ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను. వాజ్‌పేయీ తన జీవితంలోని ప్రతి క్షణాన్ని దేశ సేవకు అంకితం చేసిన అత్యద్భుతమైన దేశభక్త రాజకీయవేత్త. అణు పరీక్షలు, కార్గిల్ యుద్ధం ద్వారా భారతదేశ శక్తిని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. అలాగే, విలువలతో కూడిన రాజకీ యాలు అంత్యోదయ, సుపరిపాలన అనే ఆశయాలను తొలిసారిగా క్షేత్రస్థాయికి తీసుకువచ్చారు. ఆయన మహోన్నత వ్యక్తిత్వం, నాయకత్వం ప్రతి బీజేపీ కార్యకర్తను దేశ నిర్మాణం వైపు ఎల్లకాలం ప్రేరేపిస్తూనే ఉంటాయి" అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వాజ్‌పేయీకి నివాళులర్పించేందుకు 'సదైవ్ అటల్' వద్ద హాజరయ్యారు. వాక్చాతుర్యం, పార్లమెంటరీ సేవ, రాజనీతిజ్ఞతకు ప్రసిద్ధి చెందిన వాజ్‌పేయి, భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వ్యవస్థాపక నాయకుల్లో ఒకరు. పార్టీ రాజకీయ ప్రస్థానాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో, మౌలిక సదుపాయాలు, దౌత్యం, ఆర్థిక విధానం, జాతీయ భద్రత వంటి రంగాల్లో భారతదేశం అనేక రంగాల్లో పరిణామం చెందింది. వాజ్‌పేయీ మూడుసార్లు భారత ప్రధాన మంత్రిగా పనిచేశారు. 1996లో ఆయన తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, అది కేవలం 13 రోజులు మాత్రమే కొనసాగింది. ఆయన 1998 నుంచి 1999 వరకు 11 నెలల పాటు, ఆ తర్వాత 1999 నుంచి 2004 వరకు పూర్తి ఐదేళ్ల పాటు ప్రధానమంత్రిగా పనిచేశారు. వాజ్‌పేయీ ఒక ప్రముఖ హిందీ కవి కూడా. ఆయన తన పార్లమెంటరీ జీవితం, ప్రజా జీవితం కారణంగా రాజకీయ వర్గాలకు అతీతంగా విస్తృతంగా గౌరవం పొందారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, 2015లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ఆయనకు ప్రదానం చేశారు. కాగా, వాజ్‌పేయి 93 ఏళ్ల వయసులో 2018 ఆగస్టు 16న కన్నుమూశారు. ఆయన జీవితం, రాజకీయ సేవ, వారసత్వాన్ని స్మరించుకునే సందర్భంగా ఏటా ఆయన వర్ధంతిని పాటిస్తారు.

# రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క

**మొదటిపేజీ తరువాయి -**

వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు. అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

## ఒకవైపు సైనిక విన్యాసాలు.. మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

**మొదటిపేజీ తరువాయి -** మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా-జపాన్-దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్

**మొదటిపేజీ తరువాయి -** నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

**మొదటిపేజీ తరువాయి -**



ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# టీజీపీఎస్సీ కీలక ప్రకటన




**మొదటిపేజీ తరువాయి -** జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

# సెప్టెంబర్ 3వ వారంలో "చలో కర్నూలు - గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభ"

## జయప్రదం చేయాలని ఆర్ పి ఎస్ - ఆర్ ఇ ఎఫ్ పిలుపు - డాక్టర్ పోతుల నాగరాజు



డోన్ (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16 రిజర్వేషన్ల పరిరక్షణ సమితి ( ఆర్ పి ఎస్ ) మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ ఇ ఎఫ్ ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ వారంలో కర్నూలు జిల్లా కేంద్రంలో "గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభ" నిర్వహించనున్నట్లు ఆర్పిఎస్ & ఆర్ఇఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు, జాతీయ ఉపాధ్యక్షులు శేష పనిలులి ప్రకటించారు. ఈ సభను జయప్రదం చేయాలని బహుజన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, లాయర్లు, ఆడిటర్లు, చార్టెడ్ అకౌంట్ ఆఫీసర్లు, వివిధ డిపార్ట్మెంట్ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులకు పిలుపునిచ్చారు.

**సభ ప్రధాన డిమాండ్లు:**

1. బీసీ లకు చట్టసభల్లో 44% రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి
2. బహుజన ఉద్యోగస్తులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలి
3. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలి
4. గ్రేటర్ రాయలసీమ పరిధిలో గిరిజనులకు 10 , ఎమ్మెల్యే2 ఎంపీ సీట్లు రిజర్వ్ చేయాలి
5. పి ఆర్ సి వెంటనే అమలు చేయాలి
6. కామన్ సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలి 7. ఆర్ పి ఎస్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలులి వెంటనే చెల్లించాలి

**పాల్గొన్నవారు:**

ఈ కార్యక్రమంలో ఆర్ ఇ ఎఫ్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రమేష్ యాదవ్, ఆర్ పి ఎస్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పెరుగు శివకృష్ణ, ఆర్ ఇ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మావిటి శ్రీరాములు, ఆర్ పి ఎస్ నంద్యాల జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జాల సురేష్, నందికొట్కూరు నియోజకవర్గం యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు శెట్టి మాన్ మధు యాదవ్, ఆర్ పి ఎస్ నంద్యాల జిల్లా నాయకులు జాల రామ్మోహను రావు, చంద్రశేఖర్, బిజినవేముల విజయ్, పగిడాల గంగాధర్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బోధి పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



## దేశభక్తి వెల్లివిరిసేలా విద్యార్థుల మార్చ్‌పాస్ట్

## విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పిడుగురాళ్ళ, (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16 పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో దేశభక్తి, జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని బోధి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభతో పాటు దేశభక్తిని చాటుకున్నారు. పాఠశాల ప్రాంగణంతో పాటు తుమ్మలచెరువు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై విద్యార్థుల మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకలకు ముందుగా పాఠశాల యాజమాన్యం అతిథులకు ఘన స్వాగతం పలికింది. అనంతరం విద్యార్థులు క్రమశిక్షణ, సమన్వయం, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచేలా మార్చ్‌పాస్ట్, పరేడ్ నిర్వహించారు. జాతీయ పతాకాలను గౌరవంగా ధరించి, దేశభక్తి నినాదాలతో అడుగులు కలిపి సాగిన విద్యార్థుల మార్చ్‌పాస్ట్ తుమ్మలచెరువు జాతీయ రహదారిపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రహదారి వెంట ఉన్న ప్రజలు, గ్రామస్థులు విద్యార్థుల క్రమశిక్షణను ఆసక్తిగా వీక్షించి అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రార్థన, వందేమాతరం అనంతరం చైర్మన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ జెండా రెపరెపలాడుతుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు గౌరవంతో జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా చైర్మన్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని వారు తెలిపారు.

### ప్రతిభకు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి, కళ, క్రమశిక్షణ, సృజనాత్మకతల సమ్మేళనంగా సాగాయి. చిన్నారుల ఉత్సాహభరిత నృత్య ప్రదర్శనలతో ప్రారంభమైన కార్యక్రమాలు, దేశభక్తి కవితా పఠనం, హిందీ మరియు ఆంగ్ల ప్రసంగాలు, దేశభక్తి గీతాలతో కొనసాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకోగా, వివిధ ప్రసంగాల ద్వారా విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను, జాతీయ ఐక్యతను, దేశం పట్ల తమ బాధ్యతను చాటి చెప్పారు. హైస్కూల్ విద్యార్థుల ఫార్మేషన్, డంబెల్స్, లేజుమ్స్ డిస్ప్లే, సూర్య నమస్కార ప్రదర్శనలు క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమన్వయం, బృంద స్ఫూర్తిని ప్రతిబింబించాయి. ప్రతి ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ స్పష్టంగా కనిపించడంతో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. పాఠ్యపుస్తక విద్యతో పాటు విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకత, బృంద స్ఫూర్తిని పెంపొందించడమే తమ విద్యా విధానంలో ముఖ్య భాగమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చివరగా దేశభక్తి నృత్య ప్రదర్శనతో వేడుకలు ఉత్సాహభరితంగా ముగిశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమిష్టిగా నిర్వహించిన ఈ వేడుకలు స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలోనూ నింపుతూ, తుమ్మలచెరువులో జాతీయ భావాన్ని చాటిచెప్పిన ఘనమైన వేడుకగా నిలిచాయి.



# అటెండర్ అండ్ వాచ్మెన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం



దాచేపల్లి (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16 ఏపీ మోడల్ స్కూల్స్ గుంటూరు పల్నాడు జిల్లాల ఆదర్శ పాఠశాలల అటెండర్ అండ్ వాచ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం నాడు కారంపూడి నందు సర్వసభ్య సమావేశం జరిగింది ఈ సమావేశానికి పల్నాడు జిల్లాల అటెండర్ అండ్ వాచ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీమతి నెల్లూరు శివకుమారి అధ్యక్షత వహించారు నెల్లూరు శివకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నూతన వేతన సవరణ ప్రకారం జీతాలు ఎందుకు వేయట్లేదని హైకోర్టు జడ్జి ప్రభుత్వ జడ్జిని ప్రశ్నించినప్పటికీ ఎవరిని ఇవ్వలేదు మోడల్ స్కూల్స్ నియామకాలన్నీ 254 జీవో నుండి నియమించి ప్రస్తుతం 151 జీవో కి మార్చి ఔట్సోర్సింగ్ లోకి నాన్ టీచింగ్ స్టాఫ్ నీ ఎందుకు మార్చారు? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఎందుకు అమలు చేయట్లేదు? మోడీ ప్రవేశపెట్టిన నూతన సవరణ చట్టం ప్రకారం జీతాలయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మంత్రి నాయక్ మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ లో పనిచేస్తున్న ఆయాలు అనగా పారిశుద్ధ కార్మికులకి గత ఆరు నెలలుగా జీతాలు ఎందుకు ఇవ్వలేదు మోడల్ స్కూల్స్ కి అనుబంధంగా పనిచేస్తున్న టైపు ఫోర్ కేజీబీవీ హాస్టల్స్ లో పనిచేస్తున్న వంటవాళ్లు వార్డెన్లకి స్టడీ టీచర్లకి వాచ్ మమల్ని గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని వాపోయారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లకు ఔట్సోర్సింగ్ సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారు కుటుంబాలు గడవక అప్పుల పాలవుతున్నారు ఆత్మహత్యలు ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తున్నారు దయచేసి ప్రభుత్వం పట్టించుకోని వీరి జీతాలు వెంటనే విడుదల చేయాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఔట్సోర్సింగ్ అమరావతి జేఏసీ నాయకులు వినుకొండ పేరయ్య మాట్లాడుతూ మోడీ ప్రవేశపెట్టిన లేబర్ చట్టాలలో ఒక చట్టం వేతన సవరణ చట్టం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ జీతాలు వేయట్లేదు వేతన సవరణ చట్టం అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది. పంజాబ్ కేరళ తెలంగాణ హర్యానా మొదలగు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోని కార్మిక చట్టాలను అమలు చేసి వేతన సవరణ ప్రకారం జీతాలు వేయాలని మినప స్కేల్ అమలు చేయాలని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఉద్ఘాటించారు ఈ సమావేశానికి డి రామయ్య కె నాగయ్య ఎం రామ లక్ష్మయ్య ఎన్ జయలక్ష్మి ఎస్ కె బాజీ కె ఆనందరావు పల్లె గుంత జట్టుపాలెం కారంపూడి ఈపూరు జిల్లాలోని మోడల్ స్కూల్స్ ఔట్సోర్సింగ్ సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు

# గుత్తిలో సజావుగా యువశక్తి కంప్యూటర్ శిక్షణ సెమిస్టర్ పరీక్షలు నిర్వహణ.



## సాంకేతిక విద్య ఉజ్వల భవిత: అరుణ్.

## విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం: యర్రగుంట జయన్న



గుత్తి(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16: ఉన్నత చదువులతో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరుచుకుని నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి నిరంతరం కృషి చేయాలని,గుత్తి యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులు సాంకేతిక విద్య వైపు అడుగులు వేస్తే భవిష్యత్తు బంగారు బాట అవుతుందని తెలిపారు.సంస్థ ద్వారా కంప్యూటర్ శిక్షణను పూర్తి చేసుకున్న 120 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్ మరియు థియరీ సెమిస్టర్ పరీక్షలు గుంతకల్లు బ్రాంచి డైరెక్టర్ యర్రగుంట జయన్న ఆధ్వర్యంలో గుత్తి శ్రీ సాయి కళాశాలలో నిర్వహించారు. సాంకేతిక విద్య ను పూర్తి చేసుకున్న తర్వాత దానిని పునాదిగా చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చని తెలిపారు.డిగ్రీ,పిజి,డిప్లొమా విద్యార్థులకు మరియు నిరుద్యోగులకు గత ఇరవై సంవత్సరాలుగా కంప్యూటర్ శిక్షణ ను అందిస్తూ వాళ్ళ ను స్వయం ఉపాధి వైపు అడుగులు వేయిస్తూనే, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేస్తున్నాం అని తెలిపారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఒక లక్ష్యం ఏర్పరుచుకుని నిరంతర కృషి పట్టుదలతో విజయాలకు బాటలు వేసుకోవాలని సూచించారు.అవకాశాలు కోసం కాకుండా అవకాశాలను సృష్టించే స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ ప్రశ్నా పత్రాలను కళాశాల కరస్పాండెంట్ పి.ధర్మారెడ్డి, గుంతకల్లు బ్రాంచి డైరెక్టర్ యర్రగుంట జయన్న విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఎక్జామినర్స్ పి.పెద్దన్న,రాజు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.ఎక్జామినేషన్ సజావుగా జరిగినట్లు అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయం..!!




పోరుమామిళ్ల (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16: పోరుమామిళ్ల స్థానిక ప్రవేటు కళాశాలలో, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.గౌసియా బేగం అధ్యక్షతన నిర్వహించిన "ప్రాంతీయ శాస్త్రీయ రాజకీయశిక్షణా..తరగతులు" లను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడుతూ.నరేంద్ర మోడీ బిజెపి,ఎన్.డి.ఏ, 12 సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ పనితీరును వివరించారు. జర్నలిస్టులపై, హక్కుల కార్యకర్తలపై, కాక్రోచ్ విద్యార్థి ఉద్యమ నాయకులపై ఊప చట్టాన్ని, పి.ఎస్.ఏ. వంటి నిర్బంధ చట్టాలను తెచ్చి, ప్రజల గొంతుకులను నొక్కి, అష్ట కష్టాలు పాలు చేశారని తెలిపారు. జమ్మూ కాశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేశారని, పార్లమెంటులో రాజ్యాంగ విరుద్ధంగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల ద్వారా ప్రజా వ్యతిరేక బిల్లులు ఆమోదింప చేశారని ఆరోపించారు. నాడు కాంగ్రెస్ రాజ్యాంగం లోని ఆర్టికల్ 356 ఉపయోగించుకొని 1959 నుండి ప్రతిపక్షాల ప్రభుత్వాలను కూలదోస్తు వచ్చిందని, 1975లో దానికి పరాకాష్టగా దేశంలో ఎమర్జెన్సీ పెట్టిందని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీల స్థాయికి ప్రజలు దిగజార్చారని గుర్తు చేశారు. నేడు 12 సంవత్సరాల మోడీ, బిజెపి, ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి, డబ్బు, నకిలీ ఓటర్లు, మతం, ప్రాంతీయ ప్రాతిపదికన విభజన, అనైతిక చర్యలలకు పాల్పడుతుందని, మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు లో పెట్టకుండా, డిలిమిటేషన్ తో ముడిపెట్టి కుట్రపూరిత మహిళా వ్యతిరేకత ప్రతిసిస్తున్నారని అన్నారు. బిజెపి ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా 18వ దేశ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, దాని పర్యావశానంగానే నేడు దేశంలో బిజెపి మైనార్టీ ప్రభుత్వం బాబు, నితీష్ ల మీద ఆధారపడి కేంద్రంలో ప్రభుత్వంనడుస్తోందన్నారుప్రజా వ్యతిరేక చర్యలకు, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం, కాక్రోచ్ విద్యార్థుల, యువకుల ఉద్యమం, జడ్ జనరేషన్ ఉద్యమాలు పెద్ద ఎత్తు దేశవ్యాప్తంగా వచ్చాయని గుర్తు చేశారు. 2029 19వ దేశ సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని చెప్పారు. దేశ ప్రజల అసంతృప్తి ఒకఉద్యమంలా మారిరాజకీయపరిణామాలు సోషలిస్టు భావాల వైపు యువత వెళ్లే అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి ఎన్.భైరవ ప్రసాద్, సిపిఎం శాఖ కార్యదర్శిలు బేబీ, మేరీ, ప్రకాష్, సోమయ్య, ఓబులమ్మ, రవి, బాల వీరయ్య, మహబూబ్ పీరా, దస్తగిరి అమ్మ, రహమత్, రమణయ్య, రాజు , మాబు సిపిఎం సభ్యులు కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో మహానేత కోట్ల 106వ జయంతి

## విద్యార్థి-యువజన హక్కుల పోస్టర్ విడుదల





డోన్ (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు లికోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి 106వ జయంతిలిని యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.డోన్ పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, యువకుల హక్కుల కోసం డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు.భారత యువజన కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్ మాట్లాడుతూ "మహానేత కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి సేవలు మరువలేనివి. ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను ఎండగడతాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య, యువకులకు ఉపాధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తాం" అని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లను విడుదల చేసి విద్యార్థులను, యువకులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

**పాల్గొన్నవారు:**

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ డోన్ నియోజకవర్గ అధ్యక్షులు అధిల్, శేఖర్, రఫీ, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు మధు, దాదా ఖలేందర్ తదితరులు పాల్గొన్నారు.మచ్చలేని నాయకుడు మహానేత కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి సేవలు చిరస్మరణీయం

# మచ్చలేని నాయకుడు మహానేత కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి సేవలు చిరస్మరణీయం

## 106వ జయంతి సందర్భంగా ఘన నివాళులు....



డోన్ (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు, కీ॥శే॥ గౌ॥ కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారి 106వ జయంతి సందర్భంగా డోన్ పట్టణంలో ఘనంగా నివాళులు అర్పించారు.డోన్ పట్టణంలోని 32వ వార్డు శ్రీనివాస నగర్‌లిలో ఉన్న విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకుడు వెంకట రంగారెడ్డి, వేమారెడ్డి యూనిట్ ఇంచార్జ్ పెనుగొండ ధనుంజయ, నర్సింహారెడ్డి, తిప్పన్న, మల్లికార్జున, బాలు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "మహానేత కోట్ల విజయభాస్కర్ రెడ్డి గారు మచ్చలేని రాజకీయ నాయకుడు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. యువతకు ఆయన ఆదర్శం" అని కొనియాడారు.విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీరాంపురంలో జేజిఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కాకినాడ,(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16 శ్రీరాంపురం: కొత్తపల్లి మండలం శ్రీరాంపురం ఎంపీయూపీ పాఠశాలలో పిఠాపురం జేజిఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జేజిఆర్ హాస్పిటల్ వైద్యులు గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, యువత సభ్యులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. పలువురు గ్రామస్థులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# సాఫ్ట్ బాల్ జిల్లా జట్లలో సుండుపల్లి విద్యార్థులకు స్థానం



కడప జిల్లా సుండుపల్లి (స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని సాఫ్ట్ బాల్ జూనియర్స్, సబ్ జూని యర్స్ బాల బాలికల జిల్లా జట్లకు సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు.ఆదివారం జూనియర్స్, సబ్ జూనియర్స్ బాల బాలికల విభాగాలలో సాఫ్ట్ బాల్ ఉమ్మడి కడప జిల్లా జట్ల ఎంపిక కోసం పుల్లంపేట మోడల్ స్కూల్ ఆటస్థలంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సెలెక్షన్స్ నిర్వహించారు.జిల్లా జట్ల ఎంపికలో భాగంగా నిర్వహించిన సెలెక్షన్ లలో సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో సుండుపల్లె ఉన్నత పాఠశాల కు చెందిన నాగ చైతన్య, ప్రదీప్, ఉమర్, అభి, లోకేష్ తమ సత్తా చాటి జిల్లా ప్రధాన జట్టులో చోటు దక్కించుకోగా లోహిత్ నాయక్ స్టాండ్ బై గా ఎంపికయినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు. సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో యువ శ్రీ, లక్ష్మి ప్రియ లు ఇద్దరు సెలెక్టర్ల దృష్టిని ఆకర్శించి జిల్లా జట్టులోకి ఎంపికయ్యారని తెలిపారు. బాలుర జూనియర్స్ విభాగంలో ఎస్ అభి, కిరణ్ కుమార్ లు సెలెక్షన్ లలో తమ ప్రతిభను కనబరచి జూనియర్స్ జిల్లా జట్టు లో స్థానం దక్కించుకున్నారని ఆమె పేర్కొన్నారు. సాఫ్ట్ బాల్ జూనియర్స్ విభాగంలో సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థులు సెలెక్షన్ లలో తమ సత్తా చాటారు.జూనియర్స్ బాలికల విభాగంలో బేబి, బాలుర విభాగంలో ఆంజనేయులు, భరత్ కుమార్ లు జిల్లా జట్లలో స్థానం దక్కించుకున్నారు.

# గుత్తిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు.



గుత్తి(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16గుత్తి పట్టణంనందు ఆదివారం పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు సూపరింటెంట్ ఎల్లప్ప వాళ్ళ స్టాపు మిత్రబృందంతో అఖిల భారత చిరంజీవి యువత మెగా యూత్ ఫోర్స్ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలుపుతున్నాము అఖిల భారత చిరంజీవి యువత అనంతపురం జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ చిన్న వెంకటేశులు మెగా యూత్ ఫోర్స్ అనంతపురం జిల్లా జాయింట్ కన్వీనర్ బోయగడ్డబ్రహ్మయ్య తిరుమలేష్ మెగా యూత్ ఫోర్స్ టౌన్ కన్వీనర్ అలివేలు ధరణి కుమార్ జాయింట్కన్వీనర్ మిద్దె ఓబులేష్ కో కన్వీనర్ రాజు డిజిటల్ మీడియా ఈశ్వర్ రోహిత్ రఘు రంగా ప్రశాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు

# కర్నూలులో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, వైసీపీ యువనాయకుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ని కలిసిన జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్ .



గుత్తి(స్ఫూర్తి పత్రిక) ఆగస్టు 16లక్కీ 2 కర్నూలు వివాహ కార్య క్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు ఎన్ రఘువీరా రెడ్డి తో మరియు యువ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తో వివాహ కార్యక్రమంలో వారిని అనంతపురం జిల్లా వైసిపి జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## అయోధ్యకు వెళ్తే వీటిని చూడడం అస్సలు మిస్సవ్వొద్దు



యావత్ భారతదేశం దృష్టంతా అయోధ్య వైపే ఉన్నది. రామ మందిరం ప్రారంభోత్సవంతో పాటు రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కనుల పండువలా సాగింది. ఎన్నో శతాబ్దాల భారతీయుల కల సాకారమైంది. ఈ క్రమంలో భారతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. దాదాపు 500 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆలయం రూపుదిద్దుకొని బాల రాముడు భక్తులకు సాక్షాత్కరించాడు. ఈ నేపథ్యంలో చాలా మంది రాముడి జన్మస్థలమైన అయోధ్యకు వెళ్లాలని భావిస్తుంటారు. అయితే, కేవలం అయోధ్యలో రామ మందిరమే కాకుండా ఇంకా ఎన్నో ప్రసిద్ధి ఆలయాలు, ప్రదేశాలు సైతం ఉన్నాయి. ఎవరైనా అయోధ్యకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటే ఈ ప్రాంతాలను సైతం చూడడం అస్సలు మిస్సవ్వొద్దు. అక్కడ ఏయే చారిత్రక, పర్యాటక ప్రాంతాలున్నాయో ఓలుక్కేద్దాం..!

### హనుమాన్ గర్హి



అయోధ్యలో మరో చారిత్రాత్మక ఆలయం ఉన్నది. అదే హనుమాన్‌గర్హి. ఇక్కడ గుహ కూడా ఉంటుంది. ఇందులోనే హనుమంతుడు నివసిస్తున్నాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందుకు అయోధ్యకు వెళ్లిన ప్రతి ఒక్కరూ హనుమాన్ గర్హిని సైతం తప్పక దర్శిస్తుంటారు. హనుమాన్ గర్హి ఆలయం నాలుగు వైపుల కోట ఆకారంలో ఉంటుంది. ప్రతి మూలలో వృత్తాకార ప్రాకారాలు కనిపిస్తాయి. ప్రధాన ఆలయానికి చేరుకోవడానికి 76 మెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ హనుమంతుడు ఆరు అంగులాల ఎత్తులో బాలుడి రూపంలో కనిపిస్తాడు. తల్లి అంజనీదేవి ఒడిలో ఉన్నట్లుగా ఉంటుంది. హనుమంతుడిచే రామనామం రాయబడిన వెండి తులసీహారం అలంకరించి ఉంటుంది. ఆలయ గోడలపై హనుమాన్ చాలీసా శ్లోకాలు కనిపిస్తాయి. ఆలయంలో ఓ స్తంభం ఉంటుంది. దాన్ని విజయం స్తంభంగా పిలుస్తుంటారు. అయోధ్యలోని రామ మందిరాన్ని సందర్శించే భక్తులు ముందుగా హనుమాన్ గర్హిని దర్శించడం ఆనవాయితీ.

### కనక్ భవన్



అయోధ్యలో రామాయణ కాలానికి చెందిన కనక్ భవన్ సైతం ఉంది. శ్రీరాముడు సీతాదేవిని వివాహమాడిన తర్వాత కైకేయి సీతాదేవికి కానుకగా ఇచ్చినట్లు స్థల పురాణం చెబుతున్నది. ఈ భవనం సీతారాముల ఆంతరంగిక భవనంగా ఉండేదని ప్రతీతి. అయోధ్యలో ఉన్న ఈ భవన్ అద్భుతమైన శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ భవనంలో సీతారాముల విగ్రహాలుంటాయి. త్రేతాయుగం నాటి ఈ భవనం శిథిలావస్థకు చేరితే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు స్వయంగా నిర్మించాడని చరిత్ర చెబుతున్నది. మధ్యయుగ కాలంలో విక్రమాదిత్య చక్రవర్తి, ఆ తర్వాత ఓర్చా రాణి వృషభాను కున్వారి పునరుద్ధరించినట్లు స్థల పురాణం చెబుతున్నది. గర్భాలయంలో సీతాదేవితో కలిసి శ్రీరాముడు దర్శనమిస్తాడు.

### సరయూ ఘాట్



అయోధ్యకు వెళ్లే వారి తప్పనిసరిగా సరయూ ఘాట్‌ను తప్పకుండా సందర్శించాల్సిందే. ప్రతి సంవత్సరం రామనవమి, దీపావళి, విజయదశమి వంటి పర్వదినాలలో వేలాది మంది ప్రజలు సరయూ నది ఒడ్డుకు వస్తుంటారు. ఈ నది గురించి పురాతన హిందూ గ్రంథాల్లోనూ ప్రస్తావించారు. శతాబ్దాలుగా యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తోంది. అయోధ్య పట్టణాన్ని ఆనుకొని ప్రవహిస్తుంది. ఈ నదిలోనే రామలక్ష్మణులు అవతారాలు చాలించారని భక్తుల విశ్వాసం. ఈ నదిని గోగ్రానది అని సైతం పిలుస్తుంటారు.

### తులసీ భవన్..



రామచరితమానస్, హనుమాన్ చాలీసాను రచించిన గోస్వామి తులసీదాస్ జ్ఞాపకార్థం నిర్మించారు. తులసీ స్మారక్ భవన్‌లో అయోధ్య శోధ్ సంస్థాన్ (అయోధ్య పరిశోధన కేంద్రం)గా ఉంది. అయోధ్య నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సాహిత్య సంప్రదాయాలను అధ్యయనం చేస్తుంది. అయోధ్యలో రామచరిత్ మానస్ రచయిత, సాధువు కవి గోస్వామి తులసీదాస్ జీకి అంకితం చేసిన స్మారక చిహ్నం కూడా కొలువై ఉంది. దీనినే తులసి స్మారక్ భవన్ అని పిలుస్తారు. ఇక్కడ ప్రార్థనలు, భక్తి సంగీతం, నాటకాలు, రాంలీలా, రామకాంత పారాయణ, తదితర కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. ఈ భవనంలో ఉన్న అయోధ్య రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో గోస్వామి తులసీదాస్ సాహిత్య రచనల పెద్ద భాండాగారం సైతం ఉన్నది.

### నాగేశ్వరనాథ్ ఆలయం



అయోధ్య రామాలయం సందర్శించిన అనంతరం ఇక్కడే కొలువైన నాగేశ్వర్ నాథ్ ఆలయాన్ని సైతం తప్పకుండా దర్శించుకోవాలి. శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించించిన ఆలయమే ఈ నాగేశ్వరనాథ్ ఆలయమని స్థలపురాణం చెబుతున్నది. ఆలయంలోని శివలింగానికి భక్తులు సరయూనది నుంచి నీటిని తీసుకువచ్చి అభిషేకం చేస్తుంటారు. ఈ ఆలయాన్ని రాముడి కుమారుడు కుశుడు నిర్మించాడని ప్రతీతి. 1750 లో నవాబ్ సఫ్దర్ జంగ్ మంత్రి నావల్ రాయ్ ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని సందర్శించడానికి సరైన సమయం శివరాత్రి. ఇక్కడ శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున శివుడి బరాత్ (ఊరేగింపు) సైతం జరుపుతారు.

### గులాబీ తోట



అయోధ్య ఆధ్యాత్మిక ప్రదేశాలతో పర్యాటక ప్రాంతాలు సైతం ఉన్నాయి. ఇందులో ఒకటి గులాబ్ బారీ. నగరంలోని అత్యంత అందమైన తోటల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పచ్చదనం పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. 8వ శతాబ్దంలో ఈ తోటలో అనేక రకాల రంగురంగుల గులాబీ మొక్కలను నాటారు. ఇక్కడ 1753-1775 మధ్య అయోధ్యను పాలించిన పాలించిన అవధ్ మూడో నవాబ్ అయిన షుజా-ఉద్-దౌలా సమాధి ఉంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాలలకు చెందిన ప్రకృతి ప్రేమికులను, వృక్షశాస్త్రజ్ఞులను గులాబీలు ఆకర్షిస్తాయి. ఇస్లామిక్ నిర్మాణ శైలి సమాధి ఉంటుంది. గార్డెన్‌లోకి ప్రవేశించగానే భారతదేశ జాతీయ చిహ్నంతో కూడిన పెద్ద స్తంభం అందరికీ స్వాగతం పలుకుతుంది. గార్డెన్‌లో అందమైన మసీదు, దాని పక్కనే చిన్న వాచ్‌టవర్ ఉన్నది. సమాధి వంపు మార్గాల గుండా నడస్తూ వెళ్తుంటో ఆ అనుభూతే వేరు.

### మోతీ మహల్



అయోధ్యలో ప్రకృతి సౌందర్యంతో నిండిన చారిత్రక ప్రదేశాల్లో మోతీ మహల్ ఒకటి. చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఫైజాబాద్‌లో ఉన్న ఒక స్మారక చిహ్నం. చాలా మంది మోతీ మహల్‌ను 'పెర్ల్ ప్యాలెస్' అని కూడా పిలుస్తుంటారు. మోతీ మహల్ అయోధ్య పట్టణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంది. 1743 ఏడీలో నిర్మించబడిన ఈ ప్యాలెస్ అప్పటి నవాబ్ షుజా-ఉద్-దౌలా భార్య రాణి బేగం ఉన్మతుజ్జోహ్రా బాను నివాసంగా ఉండేది. మొఘల్ వాస్తుశిల్పకళ భవనంలో అద్భుతంగా నిలుస్తుంది. వీటితో పాటు ఇంకా రామ్‌కోట్, శ్రావస్తి తదితర పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

# అసమానతల భారతం



ఐఎంఎఫ్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. అయినప్పటికీ, మన దేశంలోని అనేక నగరాల్లో ఖరీదైన విల్లాల పక్కనే మురికివాడలు దర్శనమిస్తాయి. ముంబైలో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ ధారావి అందుకు నిదర్శనం. మన దేశ వృద్ధి అంతంతమాత్రంగానే ఉండి, ఆదాయ అసమానతలకు దారితీయడానికి ఒక కారణం ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై తక్కువ పెట్టుబడులు పెట్టడమే ఆదాయ అసమానతలకు ప్రధాన కారణమని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలో పేర్కొన్నారు. తద్వారా అధిక ఆదాయ వర్గాల్లోని విద్యావంతులు, ఆరోగ్యవంతులు వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ నుంచి డబ్బు సంపాదించేందుకు ఎక్కువ అవకాశాలను పొందారు. అదే సమయంలో అత్యల్ప ఆదాయ వర్గాల్లోని నిరక్షరాస్యులైన కార్మికులు ఇప్పటికీ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకే కష్టపడుతున్నారు. ప్రపంచ అసమానతల నివేదిక- 2022 ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక ఆదాయ అసమానతలు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. దేశ వృద్ధిని గొప్పగా ప్రచారం చేస్తున్న మీడియాలోని ఒక వర్గం అంతర్గత సమస్యలను కప్పిపుచ్చుతున్నది. విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు ఇటీవల ఒక వార్త హల్‌చల్ చేసింది. ప్రజల ఆదాయం పెరిగినట్టు దీని ద్వారా పైకి తెలుస్తున్నప్పటికీ.. అసలు వాస్తవం వేరే ఉన్నది. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో లక్షల మంది విమాన ప్రయాణం చేసినంత మాత్రాన ఆదాయం పెరిగినట్టు కాదు. అమెరికాలో ఆదాయ అసమానతలు భారీగా ఉన్నప్పటికీ, ఆ దేశ ప్రజలు కూడా విమానయానం ఎక్కువగానే చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. విదేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగినంత మాత్రాన దేశంలో అసమానతలు తగ్గి, ఆదాయ పంపిణీ మెరుగైనట్టు కాదు. గృహ సర్వేల ఆధారంగా అసమానతలను పలు సర్వే సంస్థలు అంచనా వేస్తాయి. అయితే, ఇవన్నీ స్వీయ ప్రకటిత ఆదాయాలపై ఆధారపడి చేసిన సర్వేలే. విదేశాల నుంచి లభించే ఆదాయాలు లేదా నల్లధనం ఈ నివేదికలకు చిక్కవు. అందుకే, నివేదికల్లో పేర్కొన్న దానికంటే మరింత ఎక్కువగా వాస్తవ అసమానత ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ, ఈడీల చేతికి చిక్కకుండా ఉండేందుకు ధనవంతులు నల్లధనాన్ని ఎక్కువగా విదేశాల్లో దాచిపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. షెల్ కంపెనీలు, అనామక ట్రస్టుల ద్వారా నిధులు మళ్లిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకుంటున్నారు. విదేశాల్లో నల్లధనం దాచిన చాలామంది భారతీయుల వివరాలను 2013లో పనామా పేపర్స్ బహిర్గతం చేశాయి. వాషింగ్టన్ డీసీకి చెందిన గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ (జీఎఫ్ఐ) నివేదిక ప్రకారం.. 1948-2008 మధ్యకాలంలో 213.2 బిలియన్ డాలర్ల నల్లధనం మన దేశం నుంచి తరలిపోయింది. అయితే, సరైన ఆధారాలు లేకపోవడం, అంతర్జాతీయంగా ఉండే సంక్లిష్టతల కారణంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండాపోయింది. సాధారణంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందితే.. అది పన్నులు, ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి. ఉదాహరణకు వ్యాపారాలు వృద్ధి చెంది కంపెనీలకు ఎక్కువ లాభాలు వస్తే.. కార్పొరేట్ పన్ను పెరుగుతుంది. ఉపాధి పెరగడం ద్వారా ఆదాయ పన్ను పెరుగుతుంది. ప్రజలు ఎక్కువగా ఖర్చు చేయడం మూలంగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతాయి. కానీ, వేగవంతమైన ఈ వృద్ధి సంఘటిత రంగంలో ఉద్యోగాలను సృష్టించడం లేదు. అందువల్ల ఎక్కువమంది అసంఘటిత రంగంలో పని చేస్తూ పొట్ట పోసుకోవాల్సి వస్తున్నది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందినప్పటికీ ప్రజల ఆదాయం మాత్రం మందగిస్తున్నది. అంతేకాదు, తత్ఫలితంగా జీడీపీ కూడా తగ్గుముఖం పడుతున్నది. అందరి భారం తామే ఎందుకు మోయాలనే ఉద్దేశంతో చాలామంది పన్నులను ఎగవేసేందుకు దారులు వెతుకుతున్నారు. సంపద, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం వెనుకబాటుతనానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. 2014లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పెరుగుతున్న ఆదాయ అసమానతలు, ప్రజాస్వామ్య వెనుకబాటుతనానికి మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, సబ్సిడీలు ప్రజల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను తగ్గించడంలో విఫలమయ్యాయనే చెప్పాలి. అంతేకాదు, ఇవి ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతును కూడగట్టడంలోనూ విఫలమయ్యాయి. అందుకే బీజేపీ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఆదాయ అసమానతలు లేని, సంపద పంపిణీ అందరికీ సమానంగా జరిగే ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరమున్నది.

# గల్లా బుడ్డి కిరికిరి..










చెయ్యి పార్టీ అమాత్యుడొకరు ముఖ్య నేత మీద మస్తు గుస్సా అయ్యిండట. 'చెల్ ఈ మాత్రం దానికి నాకీ కొలువే వద్దు పో..!' అని గరం గరం అయిపోయిండట. ఇప్పుడు అందరూ గీ ముచ్చట మీదనే గుసగుసలు పెడుతున్నరు. మధువు అమాత్యుడు అంటే ఎంత ఆమ్దాని ఉండాలే. కానీ, సారుకు రూపాయి కూడా రానియ్యకుండ బుడ్డ పైస కాడ.. పెద్ద పైస కాడ 'ముఖ్య' నేతే ముందుబడి ఎక్సైజ్ చేస్తున్నడట. వచ్చిన రొక్కం వచ్చినట్టే గల్ల గురిగిల వేసుకొని పోతుంటే.. అమాత్యునికి కోపం వచ్చి నేరుగా ముఖ్య నేత దగ్గరకే పోయి నిలదీసిండట. 'దుడ్లన్ని మీరే దిగమింగితే నా గతేంగాను' అని కొట్లాట పెట్టిండట. దెబ్బకు ముఖ్య నేత దిగొచ్చి 'అన్నా.. నువ్వు జరంత కాక మీదున్నవు. ముందుగైతే మనోళ్లు గా దేశం పోతుండ్రు. నువ్వు కూడా పోయి సల్లబడి రాపో.. తిరిగొచ్చే సరికి లెక్కజేసి నియ్యి నీకిత్తా' అని బుజ్జగించి గాలిమోటరు ఎక్కించిండని జనం అనుకుంటున్నరు.

### అల్లుడు.. గిల్లుడు

ఇప్పటి దాక నలుగురు అన్నదమ్ములే పేరు మోసింద్రు కదా..! ఇగ ఇప్పుడు అల్లుడు కూడా తయారైండు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలని సామెత ఉండనే ఉన్నదిగా. మామ వెలుగు మీదున్నప్పుడే అధికారం చేయాలని అనుకున్నడో ఏమో! భీమారం బ్యాచ్‌ను దింపిండు. చేప పిల్లలను గిల్లే యవ్వారం మీద కన్నేసిండు. అల్లుడు కన్ను గీటితేనే కాంట్రాక్టు ముందుకు సాగేది. 'చెరువెండి పోతుంది గా కంటిసైగ ఏదో చెయ్యి బాబు' అని మత్స్య శాఖ అధికారులు ప్రాధేయ పడంగ.. పడంగ కాంట్రాక్టులు ఓకే చేసిండట. జూలై, ఆగస్టు మాసాల్లో చెరువుల వదలాల్సిన చేప పిల్లలను ఇప్పుడు వదిలితే ఎట్ల ఎదుగుతయని మత్స్యకార కుటుంబాలు గోల పెడుతున్నాయి.

### ఏనుగును తరిమేయండి..!

'అధ్యక్షా..!' అని పిలిపించుకున్న పెద్దాయనకు ఈ మధ్య ఎటుపోయినా.. ఏనుగే అడ్డం వస్తుందట. సమీక్షలకో.. సమావేశాలకో వెళ్లి 'ఇక మొదలుపెట్టండి' అని ఆర్డర్ వేస్తే.. ఏనుగు రావాలె సార్ అని అధికారులు అంటున్నరట. అరే.. ఈ వాడకు నేనే పెద్ద రెడ్డిని, పిల్ల ఏనుగుతో ఏముంది. 'పని కానివ్వండి' అని హూంకరించినా.. అధికారులు తలలు అడ్డంగా ఊపుతున్నరట. కటకటా ఈ అవమానభారం ఇక మోయలేను అనుకుంటూ.. పట్నంబోయి పిల్ల ఏనుగును తరిమికొట్టి తనకు పట్టాభిషేకం చేయాలని చీఫ్ నేతకు విన్నవించుకుంటే.. చీఫ్ నేత చెవులు ఊపిండట గానీ, చేతలు మాత్రం ఇప్పటి వరకు లేవు. కారు గుర్తు మీద గెలిచిన ఆ పెద్దాయన సారుకు చెయ్యిచ్చి పార్టీ ఫిరాయించిండు! అక్కడ అప్పటికే నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న నేత అడుగడుగునా అడ్డం పడుతున్నడు. ఆయన్ను తప్పించాలని ఎంత మొరపెట్టుకున్నా కాంగ్రెస్ పెద్దలు పట్టించుకోవటం లేదట. సారు పక్కన కారు మీదుండంగ తన వైభవం ఎట్లుండే.. ఇప్పుడట్లైపోతినని తలుచుకొని పెద్దాయన తెగ బాధ పడుతున్నడట.

### ఉత్త పుణ్యానికి పోతే..

మహాభారతంలో పైలుడి శిష్యుడు ఉదంకుడు కథ తెలుసు కదా..! సేమ్ టు సేమ్ ఉత్త పుణ్యానికి పోతే పాపం ఎదురైందట. ముఖ్య నేత ఊ.. అంటే సూట్‌కేసు పట్టుకొని ఢిల్లీకి ఉరుకుతున్నడు కదా..! ఆయన ఇన్నిసార్లు పోంగ నేనెందుకు పోవద్దు అనుకున్నాడో కీలక నేత. ముఖ్య కూటం మీద ఆయనకు కూడా ఎప్పటి నుంచో కన్నుంది. వద్ద పైసలు జమ చేసుకొని రెండు సూట్‌కేసుల నిండా సర్దుకొని ఢిల్లీ పోయిండట. అధిష్ఠానానికి కబురు పెడితే.. ఫలానా ఆయనకు ఇవ్వమని చెప్పారట. సూట్‌కేసులు అందుకున్న ఢిల్లీ పెద్దాయన హైదరాబాద్‌కు ఫోన్ చేసి 'మీ వోడు మాకు సూట్‌కేసులు ఇచ్చిండు. నీ సీటుకు ఎసరు పెట్టేటట్టున్నడు. జర చూసుకో' అని చెప్పిండట. ఇంకేముంది. ముఖ్య నేత ఇంటెలిజెన్స్‌ను ఎగేసి, సగేసి చిట్టా అంత తీయించి దగ్గర పెట్టుకున్నడు. తీరా హైదరాబాద్ వచ్చాక విషయం తెలిసిన కీలక నాయకుడు ఉత్త పుణ్యానికి పోతే పాపం ఎదురైందని తల పట్టుకున్నాడని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

# పర్యాటకులకు ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్ భారత్ గౌరవ్ రైలులో తొమ్మిదిరోజుల కార్తీకమాసం స్పెషల్ దివ్యదక్షిణ యాత్ర



ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పలు ఆలయాలను దర్శించుకోవాలని పలువురు భావిస్తుంటారు. ముఖ్యంగా శివాలయాలను దర్శించుకోవాలనుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకుటున్న వారికి ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. పర్యాటకులకు ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్..! భారత్ గౌరవ్ రైలులో తొమ్మిదిరోజుల కార్తీకమాసం స్పెషల్ దివ్యదక్షిణ యాత్ర..!ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభంకానున్నది. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పలు ఆలయాలను దర్శించుకోవాలని పలువురు భావిస్తుంటారు. ముఖ్యంగా శివాలయాలను దర్శించుకోవాలనుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకుటున్న వారికి ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. దివ్యదక్షిణ యాత్ర విత్ జ్యోతిర్లింగ యాత్ర పేరుతో స్పెషల్ టూర్ ప్యాకేజీని తీసుకువచ్చింది. ఈ ప్యాకేజీలో ప్రయాణం నవంబర్ 6న ప్రారంభం కానున్నది. టూర్ ప్యాకేజీలో తొమ్మిదిరోజులు, ఎనిమిది రాత్రుల పాటు పర్యటన కొనసాగుతున్నది.ప్యాకేజీలో తిరువణ్ణామలైలోని అరుణాచలం, రామేశ్వరంలోని రామేశ్వరస్వామి, మధురైలో మీనాక్షి అమ్మవారు, కన్యాకుమారిలో రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేంద్రంలో అనంతపద్మనాభ స్వామి ఆలయం, తిరుచ్చిలో రంగనాథస్వామి, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ టూర్ ప్యాకేజీలో పర్యటన హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్ జంక్షన్, ఖమ్మం, మదిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగులో, కావలి, నెల్లూరు, గూడురు, రేణిగుంట స్టేషన్లలోనూ రైలు ఆగుతుంది. ఇక పర్యటన భారత్ గౌరవ్ టూరిజం రైలులో కొనసాగుతుంది.

### పర్యటన కొనసాగేదిలా..

కార్తీక మాసం ప్రత్యేక దివ్య దక్షిణ్ యాత్ర తొలిరోజు నవంబర్ 6న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మొదలువుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు పర్యాణికులు భారత్ గౌరవ్ రైలులో మొదలవుతుంది. మధ్యాహ్నం ఒంటిగంటకు బోనగిరికి చేరుతుంది. రోజురోజు వేకువ జామున 1.20గంటలకు కావలి రైల్వేస్టేషన్‌కు రైలు వెళ్తుంది. ఉదయం 7.30 గంటలకు తిరువణ్ణామలై చేరుతుంది. ఆ తర్వాత హోటల్‌కు చేరుకొని దర్శనాలు పూర్తి చేసుకుంటారు. రాత్రి 10గంటలకు స్టేషన్‌కు చేరుకొని రామేశ్వరానికి ప్రయాణమవుతారు. మూడోరోజు ఉదయం 6.30 గంటలకు కుడాల్‌నగర్ స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా రామేశ్వరం చేరుకుంటారు. రామేశ్వర స్వామి దర్శనంతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాలకు వీక్షించేందుకు వెళ్తారు. రాత్రి రామేశ్వరంలోనే బస ఉంటుంది. నాలుగో బస్సు ద్వారా మధురైకి బయలుదేరుతారు. అక్కడ మీనాక్షి అమ్మవారి ఆలయంలో దర్శనాలు చేసుకుంటారు. సాయంత్రం వరకు షాపింగ్ చేసుకోవచ్చు. రాత్రి 11.30గంటలకు కన్యాకుమారికి వెళ్లేందుకు కుడాల్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్తారు. ఐదోరోజు కన్యాకుమారి చేరుకొని హోటల్‌కు వెళ్తారు. ఆ తర్వాత రాక్ మెమోరియల్, గాంధీ మండపం, సన్‌సెట్ పాయింట్‌ని సందర్శిస్తారు. రాత్రికి కన్యాకుమారిలోనే బస ఉంటుంది. ఆరో రోజు కన్యాకుమారి నుంచి కొచ్వెల్లి చేరుకొని త్రివేంద్రం చేరుకొని అనంత పద్మనాభ స్వామి దర్శనానికి వెళ్తారు. ఆ తర్వాత కొచ్వెల్లికి చేరుకొని తిరుచిరాపల్లికి వెళ్తారు. ఏడో రోజు శ్రీరంగం చేరుకొని ఆలయానికి వెళ్తారు. లంచ్ చేసుకొని 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న తంజావూరుకి వెళ్తారు. అక్కడ బృహదీశ్వర ఆలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత తిరుగు ప్రయాణమవుతారు. ఎనిమిదో రోజు ఉదయం 8 గంటలకు రేణికుంట చేరుతారు. తొమ్మిదో రోజు వేకువ జామున 2.30గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

### మూడు కేటగిరిలు.. ప్యాకేజీ ధరలు ఇవే..

ఈ కార్తీక మాసం స్పెషల్ టూర్ ప్యాకేజీని మూడు కేటగిరిల్లో ఐఆర్‌సీటీసీ అందిస్తున్నది. స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కేటగిరిలో అందుబాటులో ఉన్నాయి. స్లీపర్ కేటగిరికి రూ.14,250, థర్డ్ ఏసీకి రూ.21,900, సెకండ్ ఏసీకి రూ.28,450 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాకేజీలో రైలు టికెట్, హోటల్‌లో బస, బస్సు సౌకర్యం ఉంటుంది. అలాగే మార్నింగ్ టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ కవర్ అవుతాయి. ఇక పర్యాటకులందరికీ ఇన్సురెన్స్ ఉంటుంది. స్లీపర్ కేటగిరిలోని పర్యాటకులకు నాన్ ఏసీ గదుల్లో వసతి ఉంటుంది. అలాగే, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. థర్డ్ ఏసీలోని వారికి ఏసీ గదుల్లో వసతి, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం కల్పిస్తారు. కంఫర్ట్ కేటగిరిలోని అందరికీ ఏసీ గదుల్లో వసతి, ఏసీ వాహనంలో ప్రయాణం కల్పిస్తారు. ప్యాకేజీలో బుక్ చేసుకునేందుకు %ఐతీష్‌షీశిబతీఅం.ఎ.షశీఎ% వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ కోరింది. లేకపోతే సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలోని రైల్వేస్టేషన్లలోని కార్యాలయాల్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com